




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 326 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 28 జూన్ 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## ఎయిరిండియా విమాన ప్రమాదం..
# దర్యాప్తు అధికారికి 'ఎక్స్' కేటగిరీ భద్రత

**దిల్లీ, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** అహ్మదాబాద్లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటన పై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రత్యేక బృందం దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, ఈ బృందానికి నేతృత్వం వహిస్తోన్న ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్కు ముప్పు పొంచి ఉన్నట్లు నిఘా సంస్థ అంచనా వేసింది. దీంతో ఆయనకు కేంద్రం భద్రతను పెంచింది. ఏఏఐబీ డీజీ యుగంధర్కు ఇక్కనుంచి 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి.



జూన్ 16 నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నాయి. దీని ప్రకారం.. ఆయనకు సీఆర్పీఎఫ్ కమాండోలతో రక్షణ కల్పిస్తున్నారు. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటి రోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్బాక్స్ను ఏఏఐబీ ల్యాబ్కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్ లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతిచెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్పై పడటంతో అందులోని పలువురు మృతిచెందారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది.

## 'అన్నపూర్ణ పథకం' పేరు మారిస్తే..
# భారాస అధికారంలోకి వచ్చాక రద్దు




**హైదరాబాద్, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నిర్వహిస్తోన్న 'అన్నపూర్ణ పథకం' పేరు మార్పుపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఈమేరకు సీఎం రేవంత్రెడ్డిపై 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు గుప్పించారు. దిల్లీ బాస్లకు మీ విధేయత చూపించాలనుకుంటే మీ పేరును రాజీవ్ లేదా జవహర్గా ఎందుకు మార్చుకోకూడదని ప్రశ్నించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదమన్నారు. 2028లో భారాస తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అర్థరహిత నిర్ణయాలన్నింటినీ రద్దు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నారు. ఇందిర క్యాంటిన్లుగా పేరు మార్చి.. రూ.5కే భోజనం, అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# ప్రభుత్వాసుపత్రిలో ఒప్పంద ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం


**ఏఎస్ పేట, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** నెల్లూరు జిల్లా ఏఎస్ పేట ప్రభుత్వాస్పత్రిలో ఒప్పంద ఉద్యోగిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నిద్రమాత్రలు మింగడంతో ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో ఒప్పంద ఉద్యోగిని లక్ష్మి వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఓ సెల్ఫీ వీడియో తీసుకొని నిద్రమాత్రలు తీసుకుంది. వైద్యుడు సురేశ్పై ఇటీవల లక్ష్మి కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సురేశ్ పై డీఎంహెచ్వో సుజాత విచారణ జరిపారు. ఈ విచారణలో లక్ష్మికి వ్యతిరేకంగా దొరసానమ్మ వాంగ్మూలం ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వేధిస్తున్నారని దొరసానమ్మ ఆరోపిస్తున్నారు.

# టీవీ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి గర్హనీయం:పవన్ కల్యాణ్



**హైదరాబాద్, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** హైదరాబాద్ లోని ఓ టీవీ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఖండించారు. ఇది గర్హనీయమైన చర్య అన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలుంటే నిరసన తెలిపేందుకు ఓ విధానముందని, అందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదని అన్నారు. న్యూస్ ఛానెల్పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ దాడికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో 44 మంది డీఎస్పీల బదిలీ



**హైదరాబాద్, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో 44 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈమేరకు డీజీపీ జితేందర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. వై.నాగేశ్వరరావు (ఏసీపీ సీసీఎస్ సైబరాబాద్), ఆకుల చంద్రశేఖర్ (ట్రాఫిక్ ఏసీపీ మహేశ్వరం), సంపత్కుమార్ (ఏసీపీ కమాండ్ కంట్రోల్ రాచకొండ)కు బదిలీ అయ్యారు.

# పులివెందులలో పది రోజుల శిశువు అదృశ్యం

**పులివెందుల, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందులలో పది రోజుల వయసున్న మగ శిశువు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న శిశువును ఎత్తుకెళ్లారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ కనుక్కునేందుకు డీఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. కడప రిమ్స్ ఈ నెల 18న రాజకుళ్లాయమ్మ శిశువుకు జన్మనిచ్చింది.



**శిశువును ఎత్తుకెళ్లింది తెలిసిన వాళ్లే: డీఎస్పీ**

ఈ ఘటనపై డీఎస్పీ మురళీనాయక్ మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం శిశువు నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లినట్లు గుర్తించామన్నారు. కుమారి అనే మహిళ ఎత్తుకెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. రాజకుళ్లాయమ్మ, కుమారి ఇద్దరు స్నేహితులే అని పేర్కొన్నారు. శిశువును ఆటోలో తీసుకెళ్లినట్లు గుర్తించామన్నారు. నిందితురాలు కుమారి కాల్ డేటా సేకరించామని డీఎస్పీ తెలిపారు. నూజివీడు, తాడిపత్రికి చెందిన వ్యక్తులతో ఆమె మాట్లాడినట్లు చెప్పారు. త్వరలోనే శిశువు అపహరణ కేసును ఛేదిస్తామన్నారు.

# 'ఈ-ఓటింగ్'.. తొలిసారిగా 'మొబైల్ యాప్' ద్వారా ఓటు

**జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** ఎన్నికల ప్రక్రియలో ఎన్నో సంస్కరణలు తీసుకువస్తున్న ఎన్నికల సంఘం తాజాగా ఆన్లైన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా బిహార్ లో ఆరు మున్సిపల్ కౌన్సిళ్లకు జరిగిన ఎన్నికల్లో దీన్ని అమలు చేశారు. పోలింగ్ బూత్లకు చేరుకోలేని వయోవృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు, వలస కార్మికులతో పాటు ఇతరుల కోసం ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు బిహార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య ప్రక్రియ-ఎలో మరో కీలక మైలురాయిగా నిలువనుంది.




**ఏమిటీ యాప్..?**

ఈ-ఓటింగ్లో పాల్గొనాలనుకునే వారికోసం e-SECBHR యాప్ను బిహార్ ఎన్నికల సంఘం రూపొందించింది.
ఓటర్ ఐడీ, ఫోన్ నంబర్ సాయంతో ముందుగా ఇందులో రిజిస్టర్ చేసుకోవాలి.
పోలింగ్ రోజున నిర్దేశించిన సమయంలో ఎప్పుడైనా ఈ యాప్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.
సీ-డాక్ అభివృద్ధి చేసిన ఈ యాప్ ప్రస్తుతం యాండ్రాయిడ్ యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంది.
ఒక మొబైల్ ఫోన్ నుంచి గరిష్ఠంగా ఇద్దరు నమోదిత ఈ-ఓటర్లు మాత్రమే ఓటు వేసే వీలుంటుంది.
ప్రతి ఓటు కూడా సంబంధిత ఓటరు గుర్తింపు కార్డు వివరాలతో నిర్ధరణ చేసుకున్న తర్వాతే రికార్డు అవుతుంది.

**పకడ్బందీ భద్రత..**

బ్లాక్చైన్ టెక్నాలజీ సాయంతో దీన్ని రూపొందించారు. అత్యంత సురక్షిత పద్ధతిలో ఓట్లను రికార్డు చేయడంతోపాటు స్టోర్ చేసే వీలుంది.
ఫేస్ రికగ్నిషన్, మ్యాచింగ్.. దీని సాయంతో లాగిన్, ఓటింగ్ సమయంలో ఓటర్లను ధ్రువీకరించుకునేలా దీన్ని అభివృద్ధి చేశారు.
డిజిటల్ స్కానింగ్-ఓసీఆర్ (ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్).. ఓట్లను కచ్చితంగా లెక్కించడంలో సాయపడుతుంది.
ఆడిట్ ట్రయల్స్.. ఈవీఎంలలో వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) మాదిరిగానే ఓట్లను సరిపోల్చే వీలుంటుంది.
50వేల మంది ఈ-ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా దీన్ని రూపొందించామని, అయితే, ప్రస్తుతం వెయ్యి మంది నమోదు చేసుకున్నట్లు బిహార్ ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్కు లేదు:మంత్రి నిమ్మల



**పాలకొల్లు, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్కు లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ ఐదేళ్ల పాలన ఎలా ఉందో ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి నిమ్మల.. జగ్జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నిచోట్లా దోచేసి.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన చరిత్ర జగనని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ఆయన గవర్నర్కు ఫిర్యాదు చేయడం ఈ శతాబ్దపు విడ్డూరమని ఎద్దేవా చేశారు.

## ఆవును చంపిందనే కోపంతోనే
# పులులకు విషాహారం

**జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడు-కేరళ సరిహద్దుల్లోని కర్ణాటక చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలెమహదేశ్వర విన్యధామం పరిధిలో ఐదు పులులు అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అటవీశాఖ అధికారులు పులులకు విషం పెట్టి చంపిన ఓ వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. కర్ణాటకకు చెందిన మాదురాజు అనే వ్యక్తి తన ఆవును పులి వేటాడి.. చంపినందుకు ప్రతీకారంగా అక్కడ తిరిగే పులులకు విషం పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. తాము ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న 'కెంచి' అనే ఆవును ఇటీవల అడవిలో ఓ పులి వేటాడి చంపడంతో తీవ్ర ఆవేదనకు గురైన మాదురాజు ఎలాగైనా అడవిలోని క్రూరమృగాలను చంపాలని పథకం వేశాడని అధికారులు తెలిపారు. అతడి స్నేహితులు కోనప్ప, నాగరాజుల సహాయంతో చనిపోయిన తన ఆవు కళేబరంపై విషం చల్లి.. దానిని అడవికి సమీపంలో పడేసినట్లు తెలిపారు. ఆ విష కళేబరాన్ని తిన్న ఓ తల్లి పులి, నాలుగు కూనలు ప్రాణాలు కోల్పోయాయని తెలిపారు. దీంతో మాదురాజుని అతడికి సహకరించిన ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ కోసం మీణ్యం ప్రాంతంలోని 'అరణ్య భవన్'కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఘటనపై పూర్తి నివేదిక అందిన తర్వాత నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రేకు సూచించారు.



# కాంగ్రెస్లో ఎటువంటి వర్గపోరు లేదు:షర్మిల

**కాకినాడ, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా చేసేది నిజమైన ఉద్యమం కాదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్కు పనికివచ్చే ఉద్యమాలు మాత్రమే చేస్తారని ఎద్దేవా చేశారు. కాకినాడలో ఆమె మీడియాతో మాట్లాడారు.



"కాంగ్రెస్ ఒక మహా సముద్రం. పిల్ల కాలువలన్నీ సముద్రంలో కలవాల్సిందే. పార్టీలో సీనియర్లెవరూ నిరుత్సాహంగా లేరు. ఎటువంటి వర్గపోరు లేదు. అందరం కలిసి పనిచేస్తున్నాం. ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తాం. పార్టీ బలోపేతం కోసమే జిల్లాల పర్యటనలు చేస్తున్నాం. ప్రజల పక్షాన పోరాటాలు ముమ్మరం చేస్తాం. ఈ రాష్ట్రంలో భాజపాను ఎదిరించే దమ్ము ఒక్క కాంగ్రెస్కు మాత్రమే ఉంది" అని షర్మిల అన్నారు.

# మెప్మా, డ్వాక్రా..చంద్రబాబు మానస పుత్రికలు:ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):** మెప్మా, డ్వాక్రా.. చంద్రబాబు మానస పుత్రికలు అని ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) అన్నారు. మెప్మాలో పనిచేసే రిసోర్స్ పర్సన్స్కు విజయవాడలో ట్యాబ్లు పంపిణీ చేశారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 500 మందికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో మెప్మా, డ్వాక్రా బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు పాల్గొన్నారు

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# 'ది ఫ్యామిలీ మ్యాన్' ఈజ్ బ్యాక్..
## మూడో సీజన్ గ్లింప్స్ రిలీజ్

**ప్రేక్షకులను విశేషంగా అలరించిన భారతీయ వెబ్సిరీసుల్లో 'ఫ్యామిలీ మ్యాన్' కూడా ఒకటి. ఇప్పటివరకూ రెండు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది.**



మనోజ్ బాజ్పాయ్ కీలక పాత్ర పోషించగా.. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో 'ఫ్యామిలీమ్యాన్: సీజన్3' త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీమ్ సర్ప్రైజ్ ఇస్తూ.. టీజర్ను విడుదల చేసింది. ఆసక్తికరంగా ఉన్న ఆ వీడియోలో 'మీరేం చేస్తుంటారంటూ..' ఓ వ్యక్తి మనోజ్ బాజ్ సాయ్ని అడగ్గా.. 'నేను లైఫ్ అండ్ రిలేషన్షిప్ కౌన్సిలర్ను' అంటూ తివారీ అతడికి సమాధానమిచ్చాడు. ఇందులో యాక్షన్ సీక్వెన్సు భారీస్థాయిలో ఉ ఒడనున్నట్లు టీమ్ తెలిపింది. 'ది ఫ్యామిలీ మ్యాన్' ఈజ్ బ్యాక్.. న్యూ సీజన్ కోసం వేచి ఉండండి అంటూ వీడియోను ముగించింది. శ్రీకాంత్ తివారీ (మనోజ్ బాజ్పాయ్) పాత్రతో పాటు, జేకే తల్పాడే (షరీబ్ హష్మి), సుచిత్ర తివారీ (ప్రియమణి), ధృతి తివారీ (ఆశ్లేష ఠాకూర్), అరవింద్ (శరద్ ఖేల్కర్) మేజర్ విక్రమ్ (సందీప్ కిషన్) తదితర పాత్రలు మరోసారి అలరించనున్నాయి. సీజన్3లో గుల్పనాగ్, శ్రేయా ధన్వంతరి, సన్నీ హిందూజా, అభయ్ వర్మలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 'విజ్జూ.. నువ్వు గర్వపడేలా చేస్తా..'
## విజయ్ దేవరకొండకు ప్రామిస్ చేసిన రష్మిక



భిన్నమైన కథలకు ప్రాధాన్యమిస్తానంటూ రష్మిక 'మైసా' అనే కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమా పోస్టర్ లుక్ అందరినీ ఆశ్చర్యపరిచింది. దీంతో రష్మికకు ఆల్ ది బెస్ట్ చెబుతూ సినీ ప్రముఖులు పోస్టు పెట్టారు. నటుడు విజయ్ దేవరకొండ కూడా ఇన్స్టాలో ఆమెకు అభినందనలు చెప్పారు. దీనికి ఆమె ఇచ్చిన రిప్లై ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తోంది. 'ఇది అద్భుతంగా ఉండనుంది' అని విజయ్ దేవరకొండ 'మైసా' పోస్టర్ను షేర్ చేశారు. దీన్ని రీషేర్ చేసిన రష్మిక.. 'విజ్జూరీ.. ఈ సినిమాతో నేను నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా" అని క్యాప్షన్ పెడుతూ ఒక హార్ట్ ఎమోజీని జోడించారు. విజయ్ను ఆమె విజ్జూ అని పిలవడంతో మరోసారి ఈ జంట హాట్ టాపిక్గా మారింది. కొన్ని రోజులుగా వీరిద్దరూ రిలేషన్లో ఉన్నారంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా ఇద్దరూ ఒకే కారులో ప్రయాణిస్తున్న దృశ్యాలు వైరల్ గా మారాయి. ఇక వరుస విజయాలతో ఉన్న రష్మిక తాజాగా మరో భారీ ప్రాజెక్ట్ను ప్రకటించారు. 'ఇంతకుముందు ఎప్పుడూ పోషించని పాత్ర.. నేనెప్పుడూ అడుగుపెట్టని ఓ ప్రపంచం.. ఇప్పటివరకూ నేను కలవని నా మరో రూపం..' అంటూ తన కొత్త సినిమా 'మైసా' పోస్టరు షేర్ చేశారు. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం కానున్నారు. విజయ్ దేవరకొండ 'కింగ్డమ్'తో బిజీగా ఉన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'కాంటా లగా' ఫేమ్ షఫాలీ మృతిపై అనుమానాలు.. పోలీసులు ఏం చెప్పారంటే..?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్, నటి షఫాలీ జరివాలా (42) మృతి చిత్ర సీమను, అభిమానులను షాక్కు గురిచేసింది. ఆమె కార్డియాక్ అరెస్ట్తో మరణించినట్లు తొలుత వార్తలు వచ్చాయి. దీనిపై ముంబయి పోలీసులు తాజాగా అప్డేట్ ఇచ్చారు. షఫాలీ మృతికి కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు. దీంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి."అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఘటన గురించి మాకు సమాచారం వచ్చింది. అంధేరీలోని షఫాలీ నివాసంలో ఆమె మృతదేహాన్ని పరిశీలించాం. పోస్ట్మార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని కూపర్ హాస్పిటల్ కు తరలించాం. మరణానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు" అని ముంబయి పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె అపార్ట్మెంట్ను ఫోరెన్సిక్ నిపుణులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అటు పోలీసులు కూడా ఇంట్లో సోదాలు చేస్తున్నారు. వంట మనిషి, ఇంట్లో పనిచేసే వారిని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ కేసును అనుమానాస్పద ఘటనగానే పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ఉదయం షఫాలీ భర్త పరాగ్ త్యాగీ అపార్ట్మెంట్ బయట పెంపుడు శునకంతో నడుస్తూ కన్పించారు. నిన్న రాత్రి షఫాలీ అస్వస్థతకు గురవడంతో పరాగ్ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె కార్డియాక్ అరెస్టుతో మృతిచెందినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. కుటుంబసభ్యులు దాన్ని ధ్రువీకరించలేదు. "శుక్రవారం రాత్రి 11.15 గంటలకు ఆమెను ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది" అని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 2002లో వచ్చిన 'కాంటా లగా' రీమిక్స్ సాంగ్తో కుర్రకారు మదిని దోచిన ఆమె ఒక్కసారిగా ఫేమస్ అయ్యారు. దీంతో అంతా 'కాంటా లగా గర్ల్ గా పిలవడం ప్రారంభించారు. అనంతరం సల్మాన్ ఖాన్ సినిమా ముజ్సే షాదీ కరోగా చిత్రంలో ఆమె ఓ పాత్ర దక్కించుకున్నారు. అనంతరం షఫాలీ పలు టీవీ రియాలిటీ షోలలో మెరిశారు. హిందీ బిగ్బాస్ 13 లోకి సైతం ఎంట్రీ ఇచ్చారు. తొలుత మ్యుజీషియన్ హర్మీత్ సింగ్ను ఆమె పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరు విడిపోయారు. అనంతరం నటుడు పరాగ్ త్యాగీని వివాహమాడారు.


ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1914 :** ఆస్ట్రియా రాజు ఆర్చ్ డ్యూక్ ఫెర్డినాండ్ ను సెర్బియా దేశస్థుడు హత్యచేశాడు. ఈ సంఘటనే మొదటి ప్రపంచ యుద్ధంకి దారితీసింది.
- **1921 :** భారత ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన మొదటి దాక్షిణాత్యుడు, ఒకేఒక్క తెలుగువాడు, పాములపర్తి వెంకట నరసింహారావు జననం (మ.2004). (చిత్రంలో)
- **1931 :** తెలుగు చిత్ర రచయిత, నిర్మాత ముళ్ళపూడి వెంకటరమణ జననం (మ. 2011).
- **1969 :** తెలుగులో వ్యవసాయదారుల సచిత్ర మాసపత్రిక అన్నదాత ప్రారంభం (డిసెంబరు 2022 చివరి సంచిక).
- **1972 :** భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన పి.సి.మహలనోబిస్ మరణం (జ.1893).
- **1976 :** భారతదేశానికి చెందిన షూటింగ్ క్రీడాకారుడు జస్పాల్ రాణా జననం.
- **2005 :** భారతీయ పౌరసత్వ చట్టము అమలులోకి వచ్చింది.



మొదటి ప్రపంచ యుద్ధం



పాములపర్తి వెంకట నరసింహారావు



ముళ్ళపూడి వెంకటరమణ





మాసపత్రిక అన్నదాత



పి.సి.మహలనోబిస్



జస్పాల్ రాణా




భారతీయ పౌరసత్వ చట్టము

రిపబ్లిక్ స్పోర్ట్స్

# ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ పై..
# సియాటెల్ ఆర్కాస్ విజయం!

మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా డాలస్ వేదికగా ముంబయి ఇండియన్స్ న్యూయార్క్, సియాటెల్ ఆర్కాస్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్లో సియాటెల్ ఆర్కాస్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి న్యూయార్క్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 237 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ 60 బంతుల్లో 108, తాజిందర్ ధిల్లాన్ 35 బంతుల్లో 95 పరుగులు చేశారు.



సియాటెల్ జట్టు బౌలర్లలో కేల్ మేయర్స్, జెరాల్డ్ కోయెట్జీ చెరో రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన సియాటెల్ ఆర్కాస్ జట్టు 20 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 238 పరుగులు చేసింది. దీంతో ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ జట్టుపై 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. బ్యాటర్లలో షిమ్రోన్ హెట్మెయర్ 40 బంతుల్లో 97 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. కేల్ మేయర్స్ 37, సికిందర్ రాజా 30 పరుగులు చేశారు. ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 3, డెలానో పోటీటర్ 2, ఎహ్సాన్ ఆదిల్, రుషిల్ ఉగార్కర్ చెరో వికెట్ తీసుకున్నారు.

## ఇంటి చిట్కాలు

# దోశ, ఇడ్లీ పిండి మిక్సీ పట్టేటప్పుడు ఒక స్పూన్ వీటిని కలపితే పిండి చక్కగా పులుస్తుంది

**మన ఇండియన్ బ్రేక్ఫాస్ట్లో ఇడ్లీ, దోశ చాలా మంది ఇష్టంగా తింటారు. చలికాలంలో వీటిని చేయాలంటే పిండి సరిగా పులవదు.**

ఈ కాలంలో పిండి సరిగా పులవదు. అలా కాకుండా ఈ చలికాలంలోనూ పిండి సరిగ్గా పులవాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి. చలికాలంలో ప్రతి ఒక్క విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అలానే ఫుడ్ విషయంలో కూడా. ముఖ్యంగా బ్రేక్ఫాస్ట్ చేసినప్పుడు మనం ఎక్కువగా మనం ఇడ్లీ, దోశ చేస్తాం. అలా చేసినప్పుడు ముందుగా పిండిని నానబెడతాం. అయితే, ఈ పిండి ఎంత బాగా పులిస్తే అంత బాగా వస్తాయి టిఫిన్స్. కానీ, చలికాలంలో పిండి ఎక్కువగా పులవదు. ఆ పిండితో దోశ కానీ ఇడ్లీ కానీ చేస్తే గట్టిగా రాళ్ళలా వస్తాయి. అలాకాకుండా ఎలా పిండిని మిక్సీ పట్టాలి. ఎలా స్టోర్ చేయాలో తెలిస్తే పిండి చక్కగా పులుస్తుంది. మీరు ప్రతీ సీజన్లా బ్రేక్ఫాస్ట్ని ఎంజాయ్ చేయొచ్చు. అందుకోసం ఏం చేయాలో తెలుసుకోండి.




### మరమరాలు, మెంతులు..




పిండిని నానబెట్టేటప్పుడు టీ స్పూన్ మెంతులు కూడా వేసి నానబెట్టండి. దీంతో దోశలకి మంచి రంగు వస్తుంది. పిండి కూడా బాగా పులుస్తుంది. దీంతో పాటు మరమరాలు కలపండి. అవి కూడా దూదిలా ఉండే మరమరాలు కలిపితే పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా దోశలు, ఇడ్లీలు చక్కగా వస్తాయి.

### సరైన భాగాల్లో..




పిండి నానబెట్టేటప్పుడు మనం ఇడ్లీ రవ్వ, మినపప్పు, దోశకి బియ్యం ఇవన్నీ కూడా ఎంతమోతాదులో తీసుకోవాలో తెలిసి ఉండాలి. అప్పుడే ఇడ్లీ, దోశ పెర్ఫెక్ట్గా వస్తాయి. పిండి కూడా ఎక్కువగా పులుస్తుంది. కొంతమంది దోశల పిండికి బియ్యం ఎక్కువగా, మినపప్పు వేస్తారు. అదే విధంగా, ఇడ్లీకోసం మినపప్పు ఎక్కువగా రవ్వ తక్కువగా కలుపుతారు. అలా కాకుండా సరైన మోతాదులోనే తీసుకోండి.

### వేడినీటితో మిక్సీ పట్టడం..



మిక్సీ పట్టేటప్పుడు చాలా మంది నీటిని కలుపుతుంటారు. అయితే, చలికాలంలో వేడి నీరు మరీ ఎక్కువ వద్దు.. కొద్దిగా గోరువెచ్చని నీటిని పోసి మిక్సీ పట్టండి. దీని వల్ల త్వరగా పులుస్తుంది. అయితే, మరీ ఎక్కువ నీరు పోస్తే మిక్సీ జార్స్ పాడయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి, తక్కువగా అంటే గోరువెచ్చని నీరు మాత్రమే వాడండి.

### వేడిగా ఉన్న ప్రాంతంలో..



అదే విధంగా పిండిని వేడి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పెట్టండి. స్టౌ దగ్గర పెట్టడం మంచి పని. అదే విధంగా, ఎక్కువ టైమ్ పులియడానికి చూడండి. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా, పిండిని ఉంచే గిన్నెలు కూడా కరెక్ట్గా ఉ ఒడేలా చూడండి. ఎలాంటి గ్యాప్ ఉండొద్దు.

### స్టీమింగ్..



మరీ ఎక్కువగా చల్లగా ఉన్నప్పుడు ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. అదేంటంటే.. మిక్సీ పట్టిన పిండిని గిన్నెలో వేసి మరిగిన నీరు ఉన్న మరో గిన్నెలో పెట్టి దీనిని కప్బోర్డ్లో ఉంచి రాత్రంత్రా అలానే ఉంచండి. దీని వల్ల పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా మైక్రోవేవ్లో కాసేపు ఉ ఒచినా పిండి చక్కగా పులుస్తుంది.

### బేకింగ్ సోడా..




అదే విధంగా, కొద్దిగా మనం బేకింగ్ సోడా కలపొచ్చు. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అయితే, ఇది ఆప్షనల్ మాత్రమే. ఎక్కువగా బేకింగ్ సోడా వద్దు. దీని వల్ల సమస్యలొచ్చే అవకాశం ఉంది.

